తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# రోడ్డు వేయకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం

కోట, మార్చి 29 ప్రభాతవార్త : కోట మండలం అల్లంపాడు-బాలిరెడ్డిపాలెం, పుచ్చలపల్లి గ్రామాల మధ్య గత డిసెంబర్‌లో వచ్చిన తుపాను కారణంగా రోడ్లు చిన్నాభిన్నమయ్యాయని పుచ్చలపల్లి గ్రామ వైసీపీ యువ నాయకుడు పాదర్తి మధుసూదన్ రెడ్డి, గ్రామస్థులు చెప్పారు. ఆ మేరకు శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఇక్కడ కనీసం గ్రావెల్ రోడ్డు వేసి వసతి కల్పించకపోతే జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరి స్తామని స్పష్టం చేశారు. గత డిసెంబర్ 5, 6 తేదీలలో తుపాను కారణంగా ఈ రోడ్డు దెబ్బతి న్నదని చెప్పారు. తుపానుకు దెబ్బతిన్న ప్రాంతానికి సాక్షాత్తు ముఖ్యమంత్రి వచ్చి పరిశీలించినా అధికారులు కనీసం గ్రావెల్ రోడ్డును కూడా వేయలేక పోవడం బాధాకరమన్నారు. విద్యార్థులకు పాఠశాలలకు వెళ్లాలన్నా, ఆసుపత్రులకు వెళ్లాలన్నా ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజాప్రతినిధులను నిలదీస్తామన్నారు.



అల్లంపాడు, బాలిరెడ్డిపాలెం మార్గం మధ్యలో దెబ్బతిన్న రోడ్డు

**ఎంపిడిఓ వివరణ :**
ఆయా గ్రామాలకు రోడ్డు వసతి లేకపోవడంతో గ్రామస్థులు ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పడంపై ఎంపిడిఓ శంకరయ్యను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, తాను ఆ గ్రామాలకు వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు. తాత్కాలికంగా అయినా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు.

# నిర్భయంగా ఓటు హక్కు వినియోగం

## ఎస్పీ జాషువా పిలుపు



చిత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు-2024ల్లో ప్రజలు నిర్భయంగా పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ జాషువా పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం తీసుకొంటున్న చర్యలపై ఎస్పీ జాషువా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వుండటానికి ప్రజలకు మేము వున్నాము అని భరోసా కల్పించడానికి, స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిర్భయంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవసరమైన వాతావరణం కల్పించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. ప్రజల్లో ధైర్యం కల్పించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరు సహకరించాలని కోరారు. జిల్లాకు ఇప్పటి వరకు మూడు కంపెనీల ఎస్ఎస్‌బి(సహస్త్ర సీమాబల్) బలగాలు, ఒక సిఆర్‌పిఎఫ్ బలగం వచ్చిందన్నారు. ఇందులో సిఆర్‌పిఎఫ్ కంపెనీని కుప్పం సబ్ డివిజన్‌కు, ఒక ఎస్ఎస్‌బి బలగం నగరి సబ్ డివిజన్, మరో 2 ఎస్ఎస్‌బి బలగాలను చిత్తూరు, పలమనేరు సబ్ డివిజన్లకు అటాచ్ చేయడం జరిగిందన్నారు. ఈ బలగాలు ఆయా సబ్ డివిజన్ అధికారుల ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తుంటాయన్నారు. ఈ కవాతు ప్రదర్శన ముఖ్య ఉద్దేశం ప్రజల్లో ఎన్నికల నిర్వహణ పట్ల నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడానికేనన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఆసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే విచ్ఛిన్నకర శ్తులకు ముందస్తు హెచ్చరిక జారీ చేయడానికి ఈ కవాతు ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లాలో ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు శుక్రవారం చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన వీధులు, ముఖ్యమైన కాలనీల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే కుప్పం సబ్ డివిజన్ పరిధిలో డిఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో గుడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. గుడుపల్లి ఎస్ఐ లక్ష్మీకాంత్, సిబ్బంది కేంద్ర బలగాలతో కలిసి ఆయా పరిధిలోని ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ముఖ్యమైన గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

# నేడు శ్రీకాళహస్తిలో చంద్రబాబు ప్రజాగళం

## -రాత్రికి పట్టణంలోనే బస

శ్రీకాళహస్తి మార్చి 29 ప్రభాతవార్త:శ్రీకాళహస్తి రాజకీయంలో పలు కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. శ్రీకాళహస్తి వైకాపా శాసనసభ్యుడు శాసనసభలోనూ, స్థానికంగా సంధిస్తున్న విమర్శలపై తెలుగుదేశం పార్టీ సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో జరగబోవు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.దాంతో ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నేపథ్యంలో అభ్యర్థి ఎంపికపై చోటు చేసుకున్న అసంతృప్తిని చంద్రబాబునాయుడు దాదాపుగా పరిష్కరించారు. శనివారం నాటి సభలో చంద్రబాబునాయుడు ఏం ప్రకటన చేస్తారో అని కార్యకర్తలు ఉత్కంఠతతో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం శ్రీకాళహస్తిలో బస చేస్తారనటంతో ఇంకా ఉత్కంఠత చోటు చేసుకుంది. అంతేకాక ప్రతిపక్ష హోదాలో చంద్రబాబునాయుడు శ్రీకాళహస్తిలో బస చేయటం రెండవ సారి. ఈ బసలో చాలా మంది పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.



ఎంజిఎం ఆస్పత్రిలో ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న బొజ్జల

**పార్టీ కార్యాలయంలో బస:**
శ్రీకాళహస్తిలో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శనివారం జరుగు ప్రజాగళం సభ అనంతరం రాత్రికి శ్రీకాళహస్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యలయంలో బస చేయనున్నట్లు నియోజక వర్గ ఉమ్మడి పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం పట్టణంలోని బేరివారి మండపం వద్ద ప్రజాగళం సభ జరుగుతుందన్నారు.శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతంలోని ఎంజిఎం ఆసుపత్రి వద్ద హెలిప్యాడ్‌లో దిగి అక్కడ నుంచి నేరుగా రోడ్డు మార్గాన బేరివారిమండపం వద్ద సభ ప్రాంగాణానికి చేరుకుంటారన్నారు. సభ ముగింపు అనంతరం శ్రీకాహస్తిలో బస చేసి పార్టీ నాయకులతో చేరికలపై చర్చించి ఆదివారం అల్పాహారం తరువాత పొట్టి శ్రీరాములు జిల్లా (నెల్లూరు) కావలిలో జరిగే ప్రజాగళం సభకు బయల్దేరి వెళుతారన్నారు. శ్రీకాళహస్తిలో జరిగే ప్రజాగళం సభను పాల్గొన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

# వైసీపీకి జనాదరణతో... టీడీపీకి భయం

**- టీడీపీ హయాంలో దేశద్రోహం కేసులు - మైనారిటీలకు బిజెపి కంటే టిడిపియే ప్రమాదకరం - రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి మగ్దూం మొహిద్దిన్**



గూడూరు రూరల్, మార్చి 29 ప్రభాత వార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణతో టిడిపికి భయం పట్టుకుందని వైసీపీ రాష్ట్రఅధికార ప్రతినిధి ఎండి మగ్దూం మొహిద్దిన్ అన్నారు. శుక్రవారం గూడూరులోని సనత్‌నగర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి మైనారిటీ నాయకులు పత్రికా సమావేశంలో టిడిపి పాలనలో మైనారిటీల అభివృద్ధి జరిగిందని, మైనారిటీలకు పెద్దపీట వేసింది టిడిపియే అని అంటుంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారన్నారు. గతంలో చంద్రబాబు మీటింగ్‌లో ఇచ్చిన హామీల గురించి ప్లకార్డులు ప్రదర్శించిన యువకులపై దేశద్రోహం కేసు పెట్టిందని ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. అధికార సమయం నాలుగు నెలల్లో పూర్తవుతుందనగా మైనారిటీ ఓట్ల కోసం మంత్రి పదవి ఇచ్చిన విషయం కూడా ప్రజలు, ముఖ్యంగా మైనారిటీలు మరిచిపోలేదన్నారు. వైసీపీని ఓడించాలని టీడీపీ అధినాయకులు బిజెపితో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. తిరుపతి పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా రాణిస్తున్నారని అన్నారు. ఎవరెన్ని అసత్య ఆరోపణలు చేసినా, ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకొని వచ్చినా ప్రజలు వైసీపీ వెంటే ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలలో ఉన్న మైనారిటీలు వైసీపీలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మగ్దూమ్, అజీజ్‌ఖాన్, ఆల్తాఫ్, జలీల్, బాబు, హషీమ్, అన్వర్‌భాయ్, అర్షాద్, రఫీ, కాలేషా, పందు, సందాని, నాజర్‌లు పాల్గొన్నారు.

# మీ ఆశీస్సులతో...ఎన్నికల్లో గెలుపుకు కలసి నడుద్దాం!

**-జగన్ ఎస్‌సిలను వాడుకుని వదిలేశాడు -అరాచక విధానాలు నచ్చకుండానే పార్టీని వీడా -తిరుపతి ఎంపి అభ్యర్థి డాక్టర్ వరప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు**





తిరుపతి,మార్చి 29ప్రభాతవార్త: రాష్ట్రంలో వైసిపి అరాచకాలను, అవినీతిని అడ్డుకునేందుకు టిడిపి, బిజెపి, జనసేన కూటమి పార్టీల్లో అందరూ కలసి ముందుకు నడవాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. పార్టీల్లోని ప్రతి కార్యకర్త, నాయకుడు మీరే ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులనే భావనతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తిరుపతి ఎంపి అభ్యర్థిగా బిజెపి నుండి అవకాశం లభించిన డాక్టర్ వరప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేనపార్టీ అవకాశమిచ్చిన ఆరణి శ్రీనివాసులు శుక్రవారం మధ్యాహ్నం ఓ హోటల్‌లో పార్టీల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు అభ్యర్థులు కూడా వైసిపిని వీడి ఈ పార్టీల్లో చేరాల్సిన అవసరం తెలియజేశారు. వైసిపిలో ఎస్‌సిలకు సముచిత స్థానం ,న్యాయం లేదని, అవకాశాలకు వాడుకుంటున్నారన్నారు. 27మంది దళిత ఎమ్మెల్యేలను జగన్ మార్చాడన్నారు. జగన్ ,వైసిపి నేతల అరాచకాలు నచ్చకుండానే పార్టీని వీడానన్నారు. పార్టీలో, ప్రభుత్వంలో రెడ్లకే పదవులన్నీ జగన్ కట్టబెట్టాడని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో అందరూ కలసి జగన్‌ను ఇంటికి సాగనంపాలని అన్నారు. తనకు ఎంపి అభ్యర్థిగా బిజెపి గుర్తించి టిక్కెట్ ఇవ్వడం మీ అందరి ఆశీస్సులతోనేనన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ, ప్రకాశం,నెల్లూరు జిల్లాల్లో 72 సీట్లు ఉంటే బలిజలకు ఒక్క సీటు కూడా జగన్ ఇవ్వలేదని దుయ్యబట్టారు. రిజర్వు సీట్లు మినహా అన్ని సీట్లు రెడ్లకే ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఖచ్చితంగా కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. చంద్రబాబు అనుభవం, మోదీ తంత్రం, పవన్‌కల్యాణ్ ఆదరణతో తిరుపతిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దు తానని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ళలో అభివృద్ధి ఏందో, ఏమి చేశారో ప్రజలు తెలుసుకున్నారని, ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపుతారన్నారు. అంతకుముందు జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, రాజారెడ్డి, కిరణ్ రాయల్, గుత్తానాగరాజురాయల్, బిజెపి నేతలు భానుప్రకాష్, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, చంద్రప్ప, కృష్ణయ్య, గుండాల గోపీనాథరెడ్డి, జల్లిమధుసూదన్, రవిప్రపసాద్, శాంతారెడ్డి, డాక్టర్ శ్రీహరిరావు తదితరులు సన్మానించారు.

# శ్రీకాళహస్తిలో... కూటమి సమైక్య గళం

## చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం



కూటమి సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి,మార్చి 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోనూ,రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనను అవినీతి సామ్రాజ్యాన్ని, అబద్ధపు అడ్డగోలు మభ్యపెట్టె పాలనను కలిసి కట్టుగా పని చేసి తుదముట్టిదామని,ఇందుకు శనివారం నాటి చంద్రబాబు నాయుడు రోడ్ షోను విజయవంతం చేద్దామని నాయకులు తమ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సాధారణంగా చంద్రబాబునాయుడు ఎన్నికల సమరశంఖాన్ని ఉమ్మడి జిల్లాలో తిరుపతి నుంచి శ్రీకారం చుట్టే వారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఎన్నికల శంఖారావం బహిరంగ సభను మరో పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి నుంచి శ్రీకారం చుడుతున్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోడ్ షో శ్రీకాళహస్తి, రెండవది సూళూరు పేటలో ఏర్పాటు చేసారు. రెండు సభలు శనివారం జరగనున్నాయి. ఇందుకు శ్రీకాళహస్తిలోని తెలుగు దేశం, బిజెపి, జనసేన పార్టీలు శుక్రవారం మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు ఇంటి వద్ద సమావేశం అయ్యారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నేడు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. మరో సారి అవకాశం కోసం గతంలో ఒక్క అవకాశంతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసాడన్నారు. మరోసారి సిద్ధం అవుతున్నారని కానీ జనంలో ఆయన జిమ్మిక్కుల పాలన అర్థమైందన్నారు.

**సభను విజయవంతం చేద్దాం:**
శ్రీకాళహస్తిలో ఎప్పుడు చంద్రబాబునాయుడు బహిరంగ సభ కాని,రోడ్ షోకాని బేరివారి మండపం వద్దనే ఏర్పాటు చేసే వారు. ఈ సారి కూడా అక్కడే ఏర్పాటు చేసారు. అయితే ఈ సారి ఉమ్మడి సభగా నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివి నాయుడు ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేసారు. స్థానికంగా సాగుతున్న అరాచక, అవినీతి పాలనకు చరమ గీతం పాడాలన్నారు. ఇందుకు పిలుపుగా చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేయాలన్నారు. తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఉదయం బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్‌ను కలిసి చర్చించారు. గురువారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోటతో చర్చించారు. శుక్రవారం అందరూ కలసి సమావేశం అయ్యారు.ఈ సమావేశంలో చంద్ర బాబునాయుడు సభలో ఎలాంటి అవాంతరాలు,అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళికలు రచించుకున్నారు. రోడ్ షో సాయంత్రం 4.30 గంటలకు ఉంటుందని వివరించారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివి నాయుడు, బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్, సుధీర్‌రెడ్డి వారి అనుచరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



తిరుపతి హెల్త్, మార్చి 29 ప్రభాతవార్త : తిరుపతి కేబి లే అవుట్‌లోని షెకీనా చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు సీనియర్ పాస్టర్ అరుల్ అరసు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఘనంగా జరిగింది. మానవాళి పాప పరిహారంగా కల్వరి సిలువలో ప్రాణ త్యాగం చేసి, బలిఅర్పనగా అర్పించుకొన్న యేసు క్రీస్తు మరణాన్ని వందలాది మంది క్రైస్తవులు సిలువ ధ్యానము చేసుకుంటూ, ప్రత్యేకంగా సిలువలో పలికిన ఏడు అమూల్యమైన మాటను ఏడుగురు వక్తులచే బోధించబడి, యేసుక్రీస్తును హింసించిన వారికి క్షమాగుణం, సిలువ దొంగకు పరదైసు ప్రాప్తి, తల్లికి ఆదరణ, నా దేవా నన్నెందుకు చేయి విడిచితివి, తండ్రి ప్రణాళికను సమాప్తి చేయుట, తండ్రికి తన ఆత్మను అప్పగించుకొనుట, గూర్చి ధ్యానిస్తూ, శిలువా రక్తదారులతో మానవాళి పాపమును పరిహరించమని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువ పాటలు పాడుతూ, దేవుని త్యాగమును స్తుతించారు. ఈ ప్రార్థనలో జోయల్, శామ్యుల్, చరణ్ చందు, జెర్మియా, మోనికా, సూసన్, జెస్సీ, జాషువా, డా. మోపే, దయాలస్, రఘు తదితరులు పాల్గొన్నారు.










# చెవిరెడ్డిని అనర్హులుగా ప్రకటించాలి!



తాయిలాలకు ఉన్న స్టిక్కర్లను చూపుతున్న నాయకులు

తిరుపతి హెల్త్, మార్చి 29 ప్రభాతవార్త : అధికార వైసిపి నాయకులకు కోడ్ వర్తించదా అని జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇంచార్జి దేవర మనోహర్ ప్రశ్నించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రేణిగుంట మండల పరిధిలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదాములలో దాదాపు 45 కోట్ల విలువైన ఓటరు ప్రభావిత బహుమతులు, ప్రచార సామాగ్రిని ఎన్నికల అధికారులు సీజ్ చేయడం జరిగిందన్నారు. వీటిని గుర్తించి ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చిన ప్రతిపక్ష పార్టీలపై కేసులు బనాయించడానికి విఫల ప్రయత్నాలు చేశారన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో 45 కోట్లతో ప్రజాప్రయోజనమైన అభివృద్ధి పనులు చేసి ఉండొచ్చు కదా అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హితవు పలికారు. వెంటనే ఎన్నికల సంఘం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అనర్హులుగా ప్రకటించాలని విజ్ఞాప్తి చేస్తున్నామన్నారు. టిడిపి నేత దొడ్ల కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం డబ్బులు వెచ్చించడం కన్నా ప్రచారాలకు చెవిరెడ్డి పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తానన్నారు. తుడా నిధులను మండలాలకు మార్పిడి చేసి అధికారులను ఉచ్చులో ఇరికించారని ఆరోపించారు. ఈసమావేశంలో మండల నాయకులు తవసి మురళి, కిషోర్, హరిష్, సాయి పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల అభ్యున్నతే తెదేపా లక్ష్యం

**కుప్పంలో ఘనంగా తెదేపా 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



కుప్పంలో కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మార్చి 29 ప్రభాతవార్త : తెలుగు ప్రజల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం ఆవరణలో తెదేపా 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పంచారు. పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కందుకూరి, గురజాడ, పొట్టి శ్రీరాములు, అంబేద కర్, పూలే స్ఫూర్తితో 1982లో దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ప్రకటించారన్నారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం కాదని ప్రజలకు సూవ చేయడమేనని దేశ రాజకీయాలకు సంక్షేమ పాలన నేర్పిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలు రాజకీయాలను శాసించే దిశగా అటు పార్టీలో, పాలనలో పదవులు ఇచ్చారన్నారు. ఇక ముందు కూడా తెదేపా ప్రజల బంగారు భవిష్యత్తుకు కృషి చేస్తుందన్నారు. పార్టీ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముందుండి నడిపిస్తున్నారన్నారు. ముఖ్య మంత్రిగా మరే ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, నేతలు డా॥ వెంకటేష్, ఆర్ముగం,కన్నన్, ఎల్‌ఉల్ ఉదయ్‌కుమార్, బుజ్జి,మునెప్ప, వాసు, బాలాజీ, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్,వసంతమ్మ, యశోదమ్మ, జయమ్మ, తిరుమగళ్, జనసేన నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## మార్చిలోపల పన్నుచెల్లిస్తే వడ్డీమాఫీ

**శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త :**

శ్రీకాళహస్తి మున్సిపాలిటికి దీర్ఘకాలంగా పన్ను బకాయిలున్న వారు ఈ నెల 31లోపల చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని కమిషనర్ ఎం.రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం జిఓ ఎం.యస్.నెంబర్ 35 తేది 29.02.2024 ఉత్తర్వుల మేరకు మున్సిపాలిటి లోని ఆస్తి, మరియు ఖాళీ జాగా పన్నులకు సంబందించి వడ్డీలేకుండా చెల్లించు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకు బకాయి ఉన్న మొత్తాన్ని ఏక మొత్తంలో వన్‌టైం సెటిల్‌మెంట్‌గా ఆస్తిపన్నుపై ఉన్న వడ్డీ మొత్తం మాఫీ చేయబడుతుందని ఈ సదవకాశాన్ని ఇంటి యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

## గిరిజన కాలనీల్లో దేశం ప్రచారం

**శ్రీకాళహస్తిరూరల్, మార్చి 29 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి మండలంలోని గిరిజన కాలనీల్లో నియోజకవర్గ ఎస్‌టి సెల్ సారధ్యంలో ఇంటింటా తెలుగుదేశం ప్రచారాన్ని చేపట్టారు. తిరుపతి పార్లమెంట్ యస్‌టి సెల్ అధ్యక్షుడు వి.రమేష్ సారధ్యంలో గిరిజన కాలనీల్లో ప్రచారం నిర్వహిం చారు. మండలంలోని ఎల్లం పల్లి, గంగల పూడి, పల్లం పేట, రమానుజపల్లి, కుంటిపూడిలలో పర్య టించి తెలుగుదేశం పార్టీకి గిరిజనులు ఎందుకు ఓటు వేయాలని వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో రమేష్‌తో పాటు టి.రామకృష్ణ, పి.మునిరాజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## లూథరన్‌చర్చిలో ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

**తొట్టంబేడు, మార్చి 29 ప్రభాతవార్త :**



పట్టణంలోని కాసాగార్డెన్ వద్ద ఉన్న లూథరన్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఫాస్టర్ రెవరెండ్ మైకెల్‌బాబు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులు ప్రత్యేకప్రార్థనలు చేపట్టారు. యేసుక్రీస్తును సిలువ వేసిన రోజునే క్రైస్తవులు ముఖ్యమైన పర్వదినాల్లో ఒకడిగా గుడ్ ఫ్రైడేను జరుపుకుంటామని ఈరోజున చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు. అనంతరం సాయంత్రం కూడా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏర్పాట్లును పర్యవేక్షించిన వారిలో చర్చి అధ్యక్షుడు ఎ.మార్టిన్, ఉపాధ్యక్షుడు కె.రమేష్, కార్యదర్శి పికెజె.అబ్రహం, ట్రెజరర్ పి.జీవరత్నం, సభ్యులు క్రాంతికుమార్, సన్నిడియల్, ప్రవీణ్‌కుమార్, అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.జేసుదాసు, గాస్పెల్ కన్వీనర్ ఇఎం.లింకన్, మహిళా అధ్యక్షురాలు ఎంఎంఎం.కళావతిల ఆధ్వర్యంలో చర్చిని విద్యుత్ వెలుగుల్లో అద్భుతంగా అలంకరణ చేపట్టారు.

## శివయ్య సన్నిధిలో వాసునంద సరస్వతీ

**శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త :**



దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి జగద్గురు శంకరాచార్య శ్రీస్వామి వాసునంద సరస్వతీ జి.మహారాజ్ హిమాలయ, స్వామీజీ వారి శిష్యబృందంతో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.వి.నాగేశ్వర రావు స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీకి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో డిప్యుటీ ఈవో, ఏసి, ఆలయ ఏఈవో మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రస్టుబోర్డు సభ్యునికి సత్కారం

**శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం వార్డు సభ్యుడుగా ఎంపికైన ఆవులపాటి శ్రీనివాసులను రాష్ట్ర మరియు జిల్లా నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు శుక్రవారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. సత్కరించిన వారిలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిఎన్.పరమ శివం, చిత్తూరు జిల్లా అధ్యక్షులు సి.సురేంద్ర, తిరుపతిజిల్లా ఉపాధ్యక్షులు సి.భాస్కర్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సి.మునికుమార్, నియోజకవర్గ సభ్యులు ఎం.మునిరామయ్య, సి.భాస్కర్, సభ్యులు కిషోర్, రాఘవేంద్ర, వెంకటేష్, మునివేలు, దేవా తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ పోటీల్లో చిన్నారి ప్రతిభ

**శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త :**



పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి చెన్నైలో ఉన్నటువంటి అమతా ఆర్గనైజేషన్ సారథ్యంలో నిర్వహించిన 22వ అంతర్జాతీయ ఆన్‌లైన్ అబాకస్ పోటీల్లో లిటిల్ మాస్టర్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి జనమాలగురుసాత్త్విక ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ అవార్డును గెలుచుకున్నారు. ఈసందర్భంగాపలువురుచిన్నారినిఅభినందించారు.

## మద్యం బాటిళ్ళు స్వాధీనం-ఒకరి అరెస్టు

**తొట్టంబేడు, మార్చి 29 ప్రభాతవార్త :**

మండలంలోని శివనాథపురం వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన కిరణ్(40) వద్ద ఆరు మద్యం బాటిళ్ళును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తున్నా, పరిమితికి మించి నగదు తరలిస్తున్నా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**కేవీబీ పురం, మార్చి 29 ప్రభాతవార్త:**

చంద్రబాబునాయుడే అమరావతిని రాజధాని చేస్తారని, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకొస్తారని ప్రజా సంక్షేమ పథకాలను అందరికి అందిస్తారని రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని రామానుజులనాయుడు తెలిపారు. మండలకేంద్రమైన కేవీబీ పురంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం మండల పార్టీ కన్వీనర్ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు రామానుజులనాయుడు అధ్యక్షతన జరిగింది. తెలుగు దేశం పార్టీని మనం ఎప్పుడు జన్మలో మరచిపోకూడదని, వైసీపీ పాలన ప్రజలు విసిగిపోయారని ప్రజలకు సంక్షేమ పథకాలు రాష్ట్రాన్ని అభివృద్ధితో తీసుకురావాలంటే తెలుగుదేశం పార్టీకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ రైతు నాయకుడు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చెంగారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.ఆర్.శివరావు, పరందామిరెడ్డి, జంగారెడ్డి, తిరుపాల్, చందన్‌నాయుడు, రాజారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్‌ఫ్రైడే ..ప్రత్యేక ప్రార్థనలు

**కుప్పంరూరల్, మార్చి 29 ప్రభాతవార్త :** కుప్పం మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలు, పట్టణంలో క్రైస్తవ సోదరులు గుడ్‌ఫ్రైడే పర్వదినం జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏసు ప్రభువు మరణాన్ని గుర్తు చేసుకుంటూ ఏసు ప్రభువును శిలువపై బంధించి కొట్టుకుంటూ తీసుకెళ్తున్న ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

రామకుప్పం : రామకుప్పంలో గుడ్‌ఫ్రైడే పండగను ఆర్‌సిఎం చర్చి, హోలిఫ్యామిలీ చర్చిల అధ్వర్ యంలో నిర్వహించారు. స్థానిక బజారు వీధిలో ఏసుప్రభువు శిలువతో ఉన్న సమయంలో పాటలు ఆలపించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిసీలకు తెలుగుదేశం అండ

**బంగారుపాళ్యం, మార్చి 29 ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల జాతులకు తెలుగుదేశం పార్టీ అండగా వుంటుందని చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం కీరమంద, కెజిసత్రం, పెరుమాళ్ళపల్లి గ్రామాల్లో తెలుగుదేశం ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమే తెలుగుదేశం పార్టీ పుట్టిందన్నారు. జరుగనున్న ఎన్నికల్లో తమకు మద్దతు పలకాలని ఆయన కోరారు. పూతలపట్టు టిడిపి అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టిడిపి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష కార్యదర్శులు సిఆర్ రాజన్, కోదండయాదవ్‌లు, మాజీఎంపిచైర్మన్‌జయచంద్రనాయుడు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైకాపా ప్రచారం కోసం వాలంటీర్ రాజీనామా

**పాలసముద్రం, మార్చి 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరోసారి వైకాపా ప్రభుత్వం ఏర్పాటు కావాలని, ఎన్నికల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి మండల పరిధిలోని వెంగళరాజుకుప్పం సచివాలయ పరిధిలోని వాలంటీర్ గోపి రాజీనామా చేశారు. ఈ మేరకు వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తుండటంతో ఇప్పటి వరకు తాను ఎవరికి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసే అవకాశం లేకపోయిందని, ప్రస్తుతం వాలంటీర్‌గా రాజీనామా చేయడంతో ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి రాష్ట్రంలో మరోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా బాధ్యతలు చేపట్టేల ఆ పార్టీ విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించ

**పుత్తూరురూరల్, మార్చి 29 ప్రభాతవార్త:**



పుత్తూరు మండలం తిరుమల కుప్పం పంచాయతీ మాజీ ఎంపీటీసీ మనీ డయాలసిస్ సమస్యతో చికిత్స పొందుతూ మృతి చెందడంతో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పరామర్శించారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు, ప్రజాప్రతినిధులు, వైసీపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మళ్లీ నగరిలో రోజమ్మని ఎమ్మెల్యేగా చేసుకుందాం

**పుత్తూరురూరల్, మార్చి 29 ప్రభాతవార్త:**



పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రోజమ్మ సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండలం ప్రజా ప్రతినిధులు వైసీపీ పార్టీ కన్వీనర్ జేసీఎస్ పార్టీ కన్వీనర్ వైసీపీ కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దిలీప్‌కు వైసీపీలో కీలక పదవి

**రేణిగుంట, మార్చి 29 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన యువ నాయకుడు దిలీప్‌ను మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా రాష్ట్ర వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. తనకు ఈ పదవి రావడానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వైసీపీ మండల పార్టీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ పార్టీలోని ఇతర ప్రముఖులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తన సేవలను గుర్తించి కీలక బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## ఎన్నికల నిబంధనల ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : డీఎస్పీ

**కేవీబీపురం, మార్చి 29 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఉదయం పుత్తూరు రూరల్ డీఎస్పీ సింధుప్రియ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొటిన్ స్టేషన్ తనిఖీల్లో భాగంగా చేయడం కొరకు వచ్చామని తెలిపారు. ఆమె మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఇది వరకే పోలీసు ఫ్లాగ్ మనీ కొన్ని చెక్‌పోస్టుల్లో భారీ తనిఖీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘిస్తే పాటించకుండా ప్రవర్తిస్తే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సహకరించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అందరూ కూడా సహకరించాలని అవసరమైతే మరోసారి కూడా పోలీసు ఫ్లాగ్ మార్చ్ చేయడం జరుగుతుందని ఆమెపేర్కొన్నారు. ఎస్ఐ రెహ్మాన్, దాము, పోలీసులు పాల్గొన్నారు.

## ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను జనసేనలోకి ఆహ్వానం

**తిరుపతి హెల్త్, మార్చి 29 ప్రభాతవార్త :**



తిరుపతిలో అనంత వీధిలో రాష్ట్ర బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ని తిరుపతి జనసేన అసెంబ్లీ అభ్యర్థి అరణి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అరణి శివ, జనసేన నగర ఉపాధ్యక్షురాలు మలిశెట్టి లక్ష్మి కలిసి ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి జనసేన పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. దీనిపై ఆర్కాట్ కృష్ణప్రసాద్ కూడా సానుకూలంగా స్పందించిందని అనుచరులతో చర్చించి త్వరలో జనసేన పార్టీలో జాయిన్ అవుతానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్, మల్లిశెట్టి లక్ష్మి, సురేష్, వినయ్, రమేష్, బాసికర్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మాత చర్చిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**తిరుపతి హెల్త్, మార్చి 29 ప్రభాతవార్త :**



శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ బ్లడ్ బ్యాంక్ విభాగం ఆధ్వర్యంలో తిరుపతి పట్టణం జగన్మాత చర్చి నందు శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరంను విజయవంతం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. తిరుపతి పట్టణం జగన్మాత చర్చి వారి అభ్యర్థన మేరకు నిర్వహించబడుతున్న ఈ రక్తదాన శిబిరంనకు విద్యార్థిని, విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరానికి స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసినట్లు తెలిపారు. పై స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డా. శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించ బడింది. బ్లడ్ బ్యాంక్ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొని బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించగా అందులో 67 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డా. సురేష్‌బాబు, నర్సింగ్ సిబ్బంది కె. రమాదేవి, ఇందిరమ్మ, టెక్నిషియన్లు కె. శ్రీదేవి, ఇ.వినోద్ కుమార్, ఎంఎస్‌డబ్ల్యూ బి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యతిరేఖ దిశలో ప్రభుత్వాన్ని నడుపుతున్న జగన్మోహన్‌రెడ్డిని

**ఏర్పేడు, మార్చి29, ప్రభాతవార్త;**



రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేఖ దిశలో నడుపుతున్న జగన్మోహన్‌రెడ్డిని సాగనంపుదా మని టిడిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఏర్పేడులో శుక్రవారం జయహో బిసి కార్యక్రమంలో భాగంగా బిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం రిగింది. ఈసమావేశానికి పెద్ద సంఖ్యలో బిసిలు పాల్గొన్నారు. ఈసదర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు బిసిలకు స్థానిక సంస్థల్లో 24శాతం రిజర్వేషన్ కలిగించడం జరిగిందన్నారు. దాన్ని నారా చంద్రబాబునాయుడు 34 శాతానికి పెంచితే,నేడు జగన్మోహన్‌రెడ్డి 30శాతాన్ని తగ్గించి 16800 పదవులను బిసిలకు దూరం చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి, రాచేటి సుబ్రమణ్యం, నిరంజన్ తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాగళంవిజవంతానికి జన సమీకరణ సమావేశం

**ఏర్పేడు, మార్చి29, ప్రభాతవార్త;**



నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి ప్టణంలో నేడు జరగనున్న ప్రజాగళం బహిరంగ సభలో జాతీయ తెలుగుదేశం అధ్యక్షు లు నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న సందర్భంగా సభను విజయ వంతం చేయాలని శుక్రవారం ఏర్పేడులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో రెడ్డివారి గురవారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పేడు మండలం నుంచి అన్ని గ్రామాల్లో ప్రజల భారీగా తరలించేందుకు అందరు సన్నద్ధం కావాలని తెదేపా నాయకులకు, కార్యకర్తలకు ఆయన సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇతికాఫ్‌తో పాపాల నిష్కృతి

**శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త :**



ముస్లింలు రంజాన్‌మాసంలో ఆచరించాల్సిన విధుల్లో ఇతికాఫ్ దీక్ష ఎంతో ప్రధానమైనదని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన రంజాన్ మాసం ప్రాధాన్యత గురించి వివరిస్తూ మాసాన్ని మూడుగా విభజించారని మొదటి పది రోజులను అల్లాహ్ దయాదాక్షిణాలకు సంబంధించి వేడుకోవాలని రెండవ పదిరోజులును మనం చేసే తప్పిదాలను శరణుగోరి క్షమించమని ప్రార్థించాలని మూడవ పది రోజులు పుణ్యారాత్రుల కోసం అన్వేషిస్తూ రాత్రంతా ప్రార్థనలు చేయాలని సూచించారు. మహమ్మద్ సొల్లె అలా సొల్లం మక్కా నుంచి మదీనా వచ్చిన తరువాత పది సంవత్సరాల పాటు ప్రతి ఏడాది రంజాన్‌మాసంలో ఇతికాఫ్ దీక్షాలు పాటించే వారని వివరించారు. ఇతికాఫ్ అంటే పట్టుదల. సమాజం,కుటుంబం, ఇహ సుఖాలను పక్కన పెట్టి మసీదుల్లో పది రోజుల పాటు గడపటం అని అర్థం అన్నారు. ప్రతి మసీదుల్లో ఎవరో ఒకరైనా పది రోజుల పాటు ఇతికాఫ్ దీక్షలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.

# తిరుపతి డివిజన్

## టీడీపీలో వర్గ విభేధాలు లేదు : పన్నూరు వాసులు

**విజయపురం, మార్చి 29 ప్రభాతవార్త:**



టీడీపీలో వర్గ విభేధాలు లేదని, టీడీపీ కార్యకర్త లందరూ సమిష్టిగా ఉన్నారని పన్నూరు దళిత వాడ వాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండ లంలోని పన్నూరు దళితవాడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో టీడీపీలో వర్గ విభేదాలు అంటూ ప్రచురితం చేయడంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. టీడీపీలో అందరు సమిష్టిగా కృషి చేస్తామని, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపిస్తామన్నారు. మాకు ఎలాంటి అభిప్రాయ బేధాలు లేవన్నారు. సమావేశంలో టీడీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

**విజయపురం, మార్చి 29 ప్రభాతవార్త:**



మండలంలో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మండలంలోని అన్నిచర్చిల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్రైస్తవ ప్రార్థన నిర్వహించారు. మండలంలో మాధవరం, ఆల పాకం, పన్నూరు, విజయపురం, జీఎం పురం, కేవీ పురం, ఇళ్ళత్తూరు చర్చిల్లో ప్రార్థన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని పార్టీలకు సంబంధించిన పలు యువకులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర పోలీసు బృందం ర్యాలీ

**విజయపురం, మార్చి 29 ప్రభాతవార్త:**



మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో శుక్రవారం కేంద్ర పోలీసు బృందం ర్యాలీ నిర్వహించినట్టు ఎస్ఐ జయప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో కళియంబాకం, బూచివానత్తం, ఆలపాకం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవచ్చని, సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా స్నేహపూరిత వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐతో పాటు పోలీసులు, ఓటర్లు పలువురు పాల్గొన్నారు.

## వైకాపా నుంచి టిడిపీలో 115 కుటుంబాలు చేరిక

**నారాయణవనం, మార్చి 29 ప్రభాతవార్త :**



సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం కల్యాణపురం పంచాయతీకి చెందిన సుమారు 115 కుటుంబాలకు చెందిన వైకాపా మద్దతుదారులు సత్యవేడు టిడిపి అభ్యర్థి కోనేటి ఆదిమూలం సమక్షంలో శుక్రవారం ఉదయం 10గంటలకు చేరారు. స్థానిక హరి పంక్షన్ హాల్ వద్ద కల్యాణపురం మాజీ సర్పంచులు ఎస్ లోకయ్య, ఎస్ శంకరయ్య, మాజీ ఎంపిటిసి గోపాల్, ఎంపిటిసి అభ్యర్థి రంగయ్య, జనసేన నాయకుడు బాలు ఆధ్వర్యంలో వైకాపా మద్దతదారులు టిడిపిలో చేరి కండువాను కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్ భాస్కరన్, పి గోవిందస్వామి, కెఎస్‌రవి, ఎ హరి, మాణిక్యంరెడ్డి, ముత్తు, కల్యాణపురం నాయకులు మదుప్రసాద్, షణ్ముగం, సుబ్బులయ్య, మునిరాజయ్య, మహేష్, విజయ్, మురళి, జయంతి, మురగయ్య, ద్రాక్షయణీ, వసంతమ్మ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

**నారాయణవనం, మార్చి 29 ప్రభాతవార్త :**



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## సుబ్రమణ్య స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు

**పాకాల, మార్చి 29 ప్రభాతవార్త:**

శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మండల పరిధిలోని ఊట్లవారిపల్లి గ్రామం, ఆనందగిరి కొండపై కొలువైన సుబ్రమణ్య స్వామి వారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ అధికారులు లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ ఆలయ ఈఓ ఉషారాణి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఫణిరాజశయన పర్యవేక్షణలో జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ హుండీ నగదు కానుకలను లెక్కించినట్లు తెలిపారు. 2024 జనవరి 4 నుండి 2024 మార్చి29 వరకు 85 రోజులకు భక్తులు రూ.1,52,091/-లు నగదు రూపేనా సమర్పించినట్లు తెలిపారు.

## విశ్వం పాలిటెక్నిక్, ఏపిఆర్‌జెసిపై అవగాహన సదస్సు

**తిరుపతి క్రీడ, మార్చి 29 ప్రభాతవార్త :**



స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపిఆర్‌జెసి నమూనా ప్రవేశ పరీక్ష, అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ అవగాహన సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి తెలియజేసారు. గత 34 సంవత్సరాలుగా సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపిఆర్‌జేసి వంటి పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష, దరఖాస్తులకు సంబంధించి మరిన్ని వివరాలకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చున్నారు.

## వెంకన్న ఆశీస్సులందుకున్నాం

**తిరుమల, మార్చి 29ప్రభాతవార్తప్రతినిధి:**



కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులందుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో తిరుపతి జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్‌పటేల్, సంయుక్త కలెక్టర్ ధ్యానచంద్ర, తిరుపతి ఎంపి అభ్యర్థి డాక్టర్ గురుమూర్తి వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రత్యేక ప్రార్థనల్లో షెకీనాలో గుడ్‌ఫ్రైడే వేడుకలు

**తిరుపతి, మార్చి 29ప్రభాతవార్త:**



ఏసుక్రీస్తు సిలువలో ప్రాణత్యాగం చేసిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేయడంఅందరికీ శుభాలు కలుగుతాయని షెకీనా చర్చి సీనియర్ ఫాస్టర్ అరుల్‌అరుసు చెప్పారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉదయం కెబిలే ఔట్‌లోని షెకీనా చర్చిలో ఫాస్టర్ అరుల్‌అరుసు, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు, శిలువపాటలు పాడి, దేవుని త్యాగాన్ని స్తుతించారు. ఈ కార్యక్రమంలో జోయల్, శ్యామ్యూల్, డాక్టర్ చరణ్‌చందు, మోనికా, రఘురామ, జెస్సీ, జాషువా, డాక్టర్ మోషే, దయాలన్, సూసన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు,న్యాయవాదులకు...అందుబాటులో ఉంటాం

**-తిరుపతి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భవానీశంకర్**

**తిరుపతి, మార్చి 29ప్రభాతవార్త:**



ప్రజలకు, న్యాయవాదులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, నూతన బార్ అసోసియేషన్ ఎప్పుడూ ముందుంటుందని తిరుపతి బార్ అసోసియేషన్ నూతన ఉపాధ్యక్షుడు వల్లంశెట్టి భవానీశంకర్ తెలిపారు. బిజెపి సీనియర్ నాయకుడు అయిన భవానీశంకర్ న్యాయవాది, తాజాగా జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడుగా నియమితులు కావడంతో శుక్రవారం బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్ తదితరులు అభినందించారు. దుశ్శాలువ కప్పి సన్మానించారు.

# శ్రీసిటీ మాండెలెజ్ పరిశ్రమచే...

## ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ వితరణ

**శ్రీహరికోట (తడ), మార్చి 28 ప్రభాతవార్త :** తడకు సమీపంలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఉన్న కార్బరీ డెయిరీ మిల్క్, ఒరియో, బోర్నవిటా వంటి దిగ్గజ బ్రాండ్ల పరిశ్రమ మాండలెజ్ ఇండియా వారు శుక్రవారం సూళ్లూరు పేటలోని కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రికి రూ.30 లక్షల విలువైన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీహరికి మాండలెజ్ ప్లాంట్ డైరెక్టర్ అమిత్‌జైన్ అంబులెన్స్ తాళాలను అందజేశారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.30 లక్షల విలువైన




అధునాతన వసతులు కలిగిన నూతన అంబులెన్స్‌ను బహూకరించామని, ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేయడం తమ కర్తవ్యమని అమిత్ జైన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో సిఎస్ఆర్ ద్వారా సూళ్లూరుపేట, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చిన ఇక్కడి కంపెనీ మాండలెజ్ ఇండియా చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, షణ్ముగ పొనుస్వామి, శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీకే సాధ్యం : బొజ్జల

ఏర్పేడు,మార్చి29, ప్రభాతవార్త;



మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీకే సాధ్యం అని శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మడిబాక పంచాయతీ పరిధిలోని రాజులకండ్రిగ గ్రామంలో మహిళల ఆత్మీయ సమావేశం క్లస్టర్ ఇన్‌చార్జి పేరం నాగరాజు నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశం ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తెలుగుదేశం ప్రభుత్వంలో గౌరవంగా ఉండేవారని, దివంగత మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తిలో ఉన్నత స్థానం కల్పించారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో గోపాలన్న ఆశయ సాధన కోసం, మహిళా స్వేచ్ఛ కోసం టిడిపి, జనసేన, బిజేపి ఉమ్మడి అభ్యర్థి అయిన నన్ను గెలిపించేందుకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ధనంజయుల నాయుడు, పాపిరెడ్డి, కృష్ణవేణి, తిరుమలయ్య తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోజాను అఖండ మెజార్టీతో గెలిపించాలి



**నింద్ర,మార్చి29 ప్రభాతవార్త :** నగరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కె రోజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని వైకాపా సినియర్ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని శ్రీరామాపురం గ్రామ పంచాయతీలో నగరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కె రోజాను గెలిపించాలని ఎన్నికల ప్రచారం ప్రారంభించినారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019వసంవత్సరం అధికారంలో వచ్చిన తరువాత దేశంలో ఎక్కడ లేని విధంగా గ్రామాలలో సచివాలయం,ఆర్‌బికె భవనాలు, వెల్‌నెస్ భవనాలును నిర్మించి అబివృద్ధి దిశగా రాష్ట్రం నడుస్తున్నదని తెలిపారు. ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,సచివాలయ వైకాపా కన్వీనర్ బాబురెడ్డి,వైస్‌యంపిపి శుభరామ్,కో ఆప్షన్ మెంబరు అనిల్,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,యంపిటిసి విజేష్ నాయకులు దామోధరం,తోయజాక్షిరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్,శివలింగం ఆచ్చారి, మేరీజయరామ్, వీరయ్యనాయుడు, దినకర్, సుధాకర్, వెంకటేశులు, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**శ్రీకాళహస్తి, మార్చి 29 ప్రభాతవార్త :**



తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శ్రీకాళహస్తి టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భాగంగా తొలుత తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం దివంగతనేత తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిధిగా టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడి ఎంఎల్ఏ అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం నాడు తెలుగుదేశంపార్టీని స్థాపించా రని వారు కూడా కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో ముందుకు వెళ్ళిన మహనీయుడని కొనియాడారు. మహిళలకు ఆస్తిలో సమానహక్కును కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దే అని ఆయన ఆశయసాధన కోసం పనిచేస్తామన్నారు. అనంతరం సుధీర్‌రెడ్డిని,హనుమంతరావులను సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, గురవారెడ్డి,దశరధాచారి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్‌లు వాడపల్లిజయచంద్రనాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, బొల్లినేని జగన్నాధంనాయుడు తొట్టంబేడు అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, వజ్రంకిషోర్, ఆర్ముగం, బుజ్జి, డిల్లీబాబు,చెంచయ్య నాయుడు, మునిరాజనాయుడు, యువతనాయకుడు, వంకాయలసిద్దులయ్య, విజయ్, రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకమ్మ పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.

## నగరిలో టిడిపి విజయం ఖాయం

**పుత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపిని స్థాపించి ఎన్టీరామారావు పేదల కడుపు నింపితే, రైతు బిడ్డలను సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబునాయుడుదని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాశ్ నాయకత్వంలో నగరిలో పార్టీ విజయం సాధిస్తుందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు డి.ఎస్.గణేష్,బాలసుబ్రమణ్యం రాజు, షణ్ముగరెడ్డి, డి.రవికుమార్, ఎన్.ఎన్ .ధనపాల్, డి.జి.ధనపాల్. బొబ్బిలి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కాణిపాకం ఆలయానికి 1.80 లక్షలు విరాళం

కాణిపాకం, మార్చి 29 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు శుక్రవారం 1.80 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు ఐరాల మండలం వద్రాంపల్లెకు చెందిన గురుజాల ఉమాపతినాయుడు అనే భక్తుడు దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నపథకానికి 1,00,116 రూపాయలను, శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 80 వేల రూపాయలను విరాళంగా అందించారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెంటెంట్ కోదండపాణి, ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు.దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న దేవాదాయశాఖ ఆర్జేసీ

కాణిపాకం, మార్చి 29 ప్రభాతవార్త:



రాష్ట్ర దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట ఆలయ ఏఈఓలు ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నారాయణవనం, మార్చి 29 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కన్వీనర్ ఎన్ భాస్కరన్ నివాసం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నారాయణవనం క్రాస్‌లో ఎన్టీఆర్ విగ్రహానిరి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే పాలమంగళం, గోవిందప్పనాయుడుకండ్రిగ దళితవాడ, అరణ్యంకండ్రిగ, ఎరికంబట్టు, తుంబూరులోను పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక నాయకులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ నేతలు పి గోవిందస్వామి, కెఎస్ రెడ్డిరెడ్డి, సుబ్రమణ్యం, కందస్వామినాయుడు, సి బాబు, ఎ హరి, వేలురెడ్డి, కెఎస్ శేఖర్, జిఎం రవి, వేలురెడ్డి, దొరవేలురెడ్డి, పద్మనాభం, మునిబాబు, గాండ్ల గోవిందశెట్టి, శరవణ, ప్రేమ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు ఘర్షణ

**కేవీబీ పురం, మార్చి 29 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన కేవీబీ పురంలో గురువారం రాత్రి ఓటీ దుకాణం వద్ద వైసీపీలో ఇరువర్గాల నాయకులు ఘర్షణకు దిగిన సంఘటన చోటు చేసుకుంది. ఇరువర్గాలు నాయకులు మాట్లాడుకుంటూ మాట మాట పెరిగి వైసీపీ బీసీసెల్ అధ్యక్షుడు అగ్రహారం హరిబాబుపై వైసీపీ కేవీబీ పురం మండల కో-ఆప్షన్ మెంబరు జాకిర్ హుస్సేన్ మద్యం మత్తులో హరిబాబు తలను జాకీర్ హుస్సేన్ పగులకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. నాపై హత్యాయత్నంకు పాల్పడడం జరిగిందని జాకీర్ హుస్సేన్‌పై బాధితుడు హరిబాబు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొంది మెరుగైన వైద్యం కొరకు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి ప్రైవేటు వాహనంలో వెళ్లారు. ఎస్ఐ లోకనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హరిబాబుకు జరిగిన సంఘటన విషయాన్ని తెలుసుకుని పరిసర గ్రామాల నుంచి స్టేషన్ వద్దకు పలువురు చేరుకున్నారు. పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా తెలుగుదేశం ఆవిర్భావదినోత్సవం

పుత్తూరు,మార్చి 29 ప్రభాతవార్త :



తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవాన్ని పుత్తూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విజయ బాబుమాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో తెలుగుదేశం విజయం ఖాయమని, రాష్ట్రంలో తెలుగుదేశం 160 స్థానాలలో విజయంసాధిస్తుం దనిధీమావ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ధనపాల్,బాలాజీనాయుడు, చంద్రాయాదవ్, బాబూరాయల్, మధుసూధనరాజు, మణికంఠన్,కోదండపాణి,రాజా,పరంధాము,రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రచారంలో వాలంటీర్



**పుత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త :** ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో వాలంటీర్ నవీన్ పాల్గొన్నారు. ఉత్తరపు కండ్రిగ గ్రామానికి చెందిన ఈ వాలంటీర్ శుక్రవారం రూరల్ మండల పరిధిలోని తొరూరు గ్రామంలో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి నిర్వహించిన ప్రచారంలో పాల్గొని ప్రచారం చేశారు.

## విద్యానగర్‌లోని హోలీ ప్రేయర్ చర్చిలో గుడ్ ఫ్రైడే

కోట,మార్చి 29 ప్రభాతవార్త :



కోట మండలం విద్యానగర్‌లోని ఉన్న హోలీ ప్రయర్ చర్చిలో గుడ్ ఫ్రైడే ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్.బిషఫ్ డాక్టర్, ఎం.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువపై మరణించక ముందు ప్రజలకు ఏడు మాటలను వివరించారని పేర్కొన్నారు.క్రీస్తు ప్రభువు మానవాళిని పాప విముక్తులుగా చేసేందుకు అవనిపై అతరించారని వివరించారు.కరుణామయుడి జననం విశిష్టమైందన్నారు. మరణ విధానామూ సాటిలేనిదన్నారు. దయామముని పునరుత్థానం విశ్వసనీయతను చాటిచెబుతుం దన్నారు. గుడ్ ఫ్రైడే,ఈస్టర్ ప్రపంచావ్యాప్తంగా ప్రసిద్ది చెందిన పర్వదినాలు ,శిలువపై తన రుధిరాన్ని (రక్తాన్ని ) చిందించి దీన జనోద్దరణ కోసం తనకు తానుగా అర్పించుకున్న రోజును గుడ్ ఫ్రైడే గా చెబుతున్నారని పేర్కొన్నారు.ఈ శుభ శుక్రవారం క్రీస్తు మరణించిన రోజు మాత్రమే కాదు, మానవుడు పరిశుద్ధతను పొంది నూతనంగా జీవించేందుకు మహోన్నతుడు ఓ అవకాశాన్ని ప్రసాదించిన రోజు అన్నారు. ద్వేషాన్ని దైవికమైన ప్రేమతోనే అధిగమించగ ాలమన్నది మరియు తనయుని భావనిన్నారు. దీన్ని ఆచరణలో చూపిన ధన్యచరితుడు ఆయన ఏసు మరణాన్ని జయించడం ద్వారా దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదని చాటి చెప్పారని పేర్కొన్నారు. సిలువపై దైవ కుమారుడు నిత్య జీవం,శత్రువుని కూడా క్షమించగలిగిన సద్గుణం, ఆదరణ, ఆప్యాయత అచంద్రార్కం నిలిచి ఉంటాయన్నారు. మరణంలో కూడా క్రీస్తు ఈలోకాన్ని ఎంతగా ప్రేమించాడో చెప్పేందుకు ఎన్నో తార్కాణాలు నిలిచియన్నారు. హోలీ ప్రేయర్ చర్చిలో పలు కార్యక్రమాలు ఏంతోగాను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్, మేరి సుజాత, డీన్ని సర్వ్యాప్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ఆలయ ఇఓకి చినమాంబట్టులో సన్మానం

**తడ, మార్చి 29 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి వాయులింగేశ్వరుని ఆలయం కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావును తడ మండలం చినమాంబట్టులో శుక్రవారం ఘనంగా సన్మానించారు. చినమాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయానికి శ్రీకాళహస్తి ఇఓ విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు. శ్రీకాళహస్తి,



మన్నారుపోలూరు, సూళ్లూరుపేట, చినమాంబట్టులను కలిపేలా భక్తులకు అనుకూలంగా బస్సులు నడిపేందుకు ఇఓ చర్యలు తీసుకోవాలని కోరారు. చినమాంబట్టుకు చెందిన ముమ్మిటి ఈశ్వరమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం చినమాంబట్టు ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, గోపూజతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బాబయ్య, అన్నదాన సమాజం వ్యవస్థాపక ఛైర్మన్, స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి, మాంబట్టు ఆలయం మాజీ ఛైర్మన్ కామిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నందారెడ్డి, గ్రామపెద్దలు చిల్లకూరు దేవేంద్రరెడ్డి, పాముల పురుషోత్తం, తిరుపతి ఎడ్యుకేషనల్ సంస్థ అధినేత వాసుదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అందరి చేత ఓటు వేయిస్తాం

### - స్వీప్ స్పోర్ట్స్ క్యాంప్‌లో యువతుల ముక్తకంఠం

**చిత్తూరు, మార్చి 29 ప్రభాతవార్త:** ఓటు వేస్తాం..! అందరి చేత ఓటు వేయిస్తాం...! అంటూ వందల యువతులు ముక్తకంఠంతో నినాదం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్, చిత్తూరు ఆర్ఓ, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు మున్సిపల్ కమీషనర్, ఏఆర్ఓ డాక్టర్ జె.అరుణ మార్గదర్శకంలో శుక్రవారం నగరపాలక సంస్థ నోడల్ టీమ్ నగర పరిధిలో విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు




నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఇరువారం వద్ద వున్న రుక్మిణి కృష్ణస్వామి జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థినిలకు ప్రత్యేక స్పోర్ట్స్ క్యాంపు నిర్వహించి ఓటు హక్కు, ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకొన్న 110 మంది యువతులు ఉత్సాహంగా ఈ స్వీప్ స్పోర్ట్స్ క్యాంపులో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా యువతులకు షార్ట్‌ఫుట్, వాలీబాల్, షటిల్, ఖో-ఖో, కబడ్డీ వంటి క్రీడలను నిర్వహించారు. యువతులు ఎంతో ఉత్సాహంగా ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.రమేష్‌బాబు మాట్లాడుతూ జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు తమ ఓటు హక్కును నిష్పక్షపాతంగా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకున్నప్పుడే ఉత్తమ ప్రభుత్వాలు ఏర్పాటు అవుతాయన్నారు. ఉత్తమ ప్రభుత్వ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నేటి యువతరం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంహెచ్ఓ, స్వీప్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ చిన్నయ్య, కళాశాల అధ్యాపకులు, స్వీప్ నోడల్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెదేపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**శాంతిపురం, మార్చి 29 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక తెదేపా కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీ స్థాపించి నప్పటి నుంచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు అదే రీతిలో పార్టీని నడుపుతూ ఆదర్శ ంగా ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఉయ్యాల జయరాంరెడ్డి, నాగరాజు, ఎల్.జయరాంరెడ్డి, మణి, బాలు,



రాజారెడ్డి, శ్రీనివాసులు, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప, హేమ, పొలారాణి పాల్గొన్నారు.

రామకుప్పం: తెదేపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి తెదేపా కృషి చేస్తోందన్నారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లోనే చంద్రబాబునాయుడు నడుస్తూ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారన్నారు. మరలా చంద్రబాబు సిఎం కావడం తథ్యమన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, సీతాపతి, శ్రీరాములురెడ్డి, పట్ర నారాయణ, విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్రి, రఫీ పాల్గొన్నారు.